గీతా స్వయంవరం

(క థా ని క)

గీత మరొక్కసారి అద్దంలో నీడ చూసుకుంది. ఎంత అందంగా వుంది తను! అజంతా శిల్పంవలె, దేవలోకంలో దేవకన్యవలె! జుట్టు వంకులొంకులు తిరిగి భుజాలమీద పడుతోంది. తనలాగ అలంకరించుకోగలిగే వాళ్లు ఒక్కరయినా వున్నారా? తన కాలి గోరుకు కూడా సరిపోరు. గీత కళ్ళల్లో గర్వం తొణికిసలాడింది.

గర్వంగా తన శరీరాన్నంతటినీ చూసుకుంది. పండు వెన్నెలలో, సహస్రదళ పద్మంలో అధివసించిన, ఎంతో పని మెళకువలు తెలిసిన శిల్పి మలచిన శచీదేవి విగ్రహంలా మెరసిపోతోంది తను. మళ్ళా అద్దం ముందు కూర్చుని కొద్దిగా ముఖానికి పౌడరు అద్దుకుంది. తువాలుతో చేతులు తుడుచుకుంటూ గదంతా అరమోడ్పు కన్నులతో కలయచూసింది. దృష్టి గబుక్కుని టేబిల్ మీద ఉన్న వుత్తరంమీద పడింది... ఎడమచేతి మునివేళ్ళతోటి జాగ్రత్తగా పట్టుకొంది ఏమిటి వుత్తరం? అన్నట్లు. శేఖరం రాసిందికదూ! పాపం వెర్రివాడు. ఆ వుత్తరం నాలుగు గంటలకే వచ్చింది. చదువకుండానే పడేసింది. అందులో ఏముంటుందో తనకు ముందే తెలుసును.

"గీతా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను" పెద్ద అక్షరాల్తోటి వ్రాశాడు. ఎవరైనా ఇంతే. ఆ వుత్తరాలు చదివిచదివి విసుగెత్తిపోయింది తనకు. ఒక్క చిన్న నవ్వు నవ్వినా, రెండు మాటలు మాట్లాడినా చాలు. ప్రతివాడూ ప్రేమలో పడడమే, ఇంక నోరు కట్టేసుకోవాలంతే. అందరూ అంతేనా?...అబ్బె కాదు కాదు. ముఖ్యంగా రామంమాత్రం అలా కాదు. అబ్బ! రామం ఎంత చక్కగా వుంటాడు! అమాయికంగావుండే ఆకళ్లుకాటుక పెట్టినట్లుంటాయి.

తను మొదటిసారిగా అతన్ని మూర్తియింట్లో పుట్టినరోజు పండుగకి వెళ్ళినప్పుడు చూసింది. తను వెళ్ళేసరికి అతను పిల్లనగ్రోవి వాయిస్తున్నాడు. అతన్ని చూడగానే తన గుండె ఒక్కసారిగా ఆగిపోయి నట్లయింది. ఎలాగైనా అతనితో మాట్లాడ్యాలి, స్నేహం చెయ్యాలి అనుకుంది. కాని అదేం తను అనుకున్నంత కష్టం అవలేదు. అతను సుందరికి అన్న వరుస అవుతాడట. ఇంజనీరుకూడాను. సుందరే తనను పిలుచుకెళ్ళి పరిచయం చేసింది.

అతనంత చదువుకున్నాడని తెలిసినా, తొణుకులేకుండా మాట్లాడేసరికి తన కాశ్చర్యం వేసింది. మరొకరైతే ఈపాటికి తిత్తిత్తే, మెమ్మెమ్మే అయ్యేవారే. ఎదురుగుండా టిష్యూ చీర, హ్యాండ్ బ్యాగు చూసేసరికి యెటువంటి వాళ్ళకైనా నత్తొస్తుంది. అతనన్న ప్రతి మాటకీ తను నవ్వింది. అసలతన్ని చూసేసరికే తనకి మతిపోయింది.

తరువాత అతన్ని రోజూ చూస్తూనేవుంది. క్లబ్ లోనో, సినిమా థియేటర్ లోనో, పార్కులోనో. అలా చూసినప్పుడల్లా తన గుండె ఒక క్షణం కొట్టుకోవడం మానేస్తూనేవుంది. ప్రతి రోజూ అతను తనగురించి ఏకొంచెమైనా అంటాడని ఆశిస్తూనేవుంది. కాని... కాని ... ఒక్కసారీ అతనేం అనలేదు.

ఈ విషయం తల్చుకుంటే, అతనిమీద ఏంతో కోపం వస్తుంది. ఎందుకనడు? మిగిలిన అందరూ మర్నాడే వుత్తరాలు రాసేవారే. కాని యీ రామం మాటవరుసకైనా నిన్ను ప్రేమిస్తున్నాను అనడేం? అలా వ్రాసిన వాళ్లందరి వుత్తరాలు చిత్తుబుట్టలో పడి గాలికెగురుతున్నాయి. రామం, వుత్తరం కాదు మాటైనా అంటే, తను కరిగి నీరై అతని పాదాలచుట్టూ నిలచిపోదూ!

అనుకుంటుంటూనే కళ్లు చెమ్మగిల్లాయి. ఎందుకనడు? యిదీ సంగతి, బహుశా అతను భయపడి వుంటాడు. తను అంపరినీ త్రోసిపుచ్చిన

సముయమంత్రి వసంతదేవి

సంగతి అతనికి తెలిసే వుంటుంది. తనపనీ అంతే అవుతుందనుకుని వుంటాడు. చిత్రం, తనకంత వరకూ యీ విషయం తట్టనేలేదు. తనతన్ని ప్రేమిస్తున్న సంగతి ఏవిధంగానూ తెలియబరచ లేదు. తెలివితేటలు!

నవ్వుకుంటూ మరోసారి అద్దంలో చూసుకుని, జార్జెట్ చీర కుచ్చిళ్ళు సరిగ్గా సర్దుకుని కారు ఎక్కింది.

తలుపు తట్టేసరికి రామం తల్లి వచ్చి తలుపు తీసింది. 'రామం ఇంట్లో వున్నాడా' అంటూనే లోపలికి అడుగు పెట్టింది.

"రా అమ్మా గీతా! యిప్పుడే నీమాట అనుకుంటున్నాను" అంది ఆవిడ. ఆవిడకి తనంటే ఎంతో ప్రేమ. చాలా ఆప్యాయంగా మాట్లాడుతుంది.

"ఏం! రామం యింట్లో లేడా!"

"అబ్బే! లేడు! అవునుగాని రామానికి తాంబూలాలు పుచ్చుకుంటున్నాం. పెళ్ళికూతురికి యెటువంటి చీర బాగుంటుందో ఏమో! నాకు ఫేషన్లు తెలీవు. చూడమ్మా గీతా! నీకు బాగా తెలుస్తుంది. వుండు చీర తెస్తాను." అంటూ జవాబు నపేక్షించకుండానే లోపలికి వెళ్ళింది.

పిలిచి కొరడాతో కొట్టినట్లయింది, గీతకు. ఏమిటీ, రామానికి పెళ్ళా? తను కడుతున్న సౌధాలన్నీ నేలపడవలసిందేనా! తనెంతెంతో ఆశలతోటి వచ్చింది. ఏమిటిల్లాగ!

"చూశావా! ఎర్రరంగిప్పుడు ఫేషనేనా! ఎర్రపట్టుచీరమీద జరీపువ్వులు బాగుంటాయా! నీకు నచ్చితే చాలు. ఫరవాలేదు. నీకంటే తెలుసున్న వారెవరు?" అంటూ ఆవిడ గీత ముఖం చూడకుండానే చదివేస్తోంది.

గీతకివేం వినిపించే స్థితిలో లేదు. అంతా అయోమయంగా ఉంది.

"అవునుగానీ! యింతకీ ఆ అమ్మాయి ఎల్లా ఉంటుంది" ఆఖరికి కూడబలుక్కుంటూ అంది.

"అబ్బే! నేచూశానా ఏమిటి? వాడే చూసుకొచ్చాడు. ఏదోనమ్మా, మూడు ముళ్లూ పడితేచాలు, నాకీ లోకంలో యింకేంకావాలి చెప్పు."

"మొదలెట్టావూ! అనుకుంటూనే వున్నాను. ఈ కబురు విన్నదగ్గర్నుంచీ అమ్మ కిదేపననుకో. విసుగూ విరామంలేదు. ఎవరైనా కనిపిస్తేచాలు. ఇంతకంటే ఒక్కసారి రేడియోలో ప్రసారం చేస్తే బాగుంటుందని చెప్తున్నాను" అంటూ నవ్వుతూ లోపలికి వచ్చాడు రామం.

గీత మెదడు వుడికి పోతోంది. ఏదో ఒకటి తేల్చేసుకోవాలివ్వాళ. తను రావటం మంచిదే అయింది.

"అమ్మా! నీ గొడవే గాని యింకెవరిదీ పట్టించుకోవు. గీతకి కాస్త కాఫీ యేనా యిచ్చావా?"

"అయ్యో నా మతి మండిపోనూ! కూర్చో అమ్మా గీతా. యిప్పుడే తెస్తాను" అంటూ ఆవిడ గబగబా లోపలికి వెళ్ళింది.

గీత వాంఛిస్తున్న సమయం యిప్పటికి దొరికింది. అడిగెయ్యాలి. ఇంక ఆలస్యం ఎందుకు?

"రామం నీకు పెళ్ళటగా!"

"అమ్మేనా చెప్తా? ఆవిడకిదేపని, ఎవరైనా కనపడ్డం భయం. మొన్న నెప్పుడో చెప్పాను. అమ్మాయిని చూసేనని. అంతే పట్టుకుంది..."

"అయితే, నేనంత వినకూడని దాన్నా" స్వరంలో రోషం బాగా తొంగిచూస్తోంది.

"నేను అల్లాగని అన్నానా!"

గీత కింకేం మాట్లాడటానికీ తోచలేదు. కాలం నిశ్శబ్దంగా గడిచిపోతోంది. మళ్ళా వాళ్ళమ్మ వచ్చేస్తుంది. చెప్పేయాలి యెలాగా!

"రామం!"

"ఏం గీతా!"

"నీకు తెలీదా!" సగంలో గొంతు పూడిపోయి నట్లయింది. మిగిలిన వాక్యం గొంతుకలోనే వుండి పోయింది.

"ఏమిటీ తెలియటం" ఆశ్చర్యంగానే అడిగాడు.

"మరి...మరి ... నేను నిన్ను ప్రేమిస్తున్నా" అని అతికష్టం మీద అనగల్గింది. తన జీవితమంతా అతను చెప్పబోయే మాటమీద ఆధారపడి వుంది.

"ఆహా! అలాగా."

"నువ్వు నన్ను ప్రేమించటం లేదా!" యింత యిలాగ తన జీవితంలో ఎవరి దగ్గిరా లొంగి

పోలేదు. కాని అతను ఊ అంటేచాలు! తను అతని కాళ్ళకింద చీమలా నలిగి పొమ్మన్నా నలిగి పోగలదు.

“నేను మాత్రం కాదన్నానా. కాని యీ సంభాషణ కోసం ఎంతమంది ఎదురు చూస్తున్నారో అని!” అతని స్వరంలో నవ్వు దాచుకుందామన్నా దాగటంలేదు. గీత కానవ్వు ముళ్ళ తిమ్మిరిలా బాధించింది. ఎంత హేళనగా అన్నాడూ! అయినా దీంతోటి తేలిపోతుంది.

“అయితే! ఆ అమ్మాయి నాకంటే అందంగా వుంటుందా?” దృఢంగానే అంది. ఆ అనడంలోనూ ఛాలెంజ్ చేస్తున్నట్టే వుంది.

“నీకంటే యీ ప్రపంచంలో అందంగా వుండే వాళ్ళెవ్వళ్ళూ లేరు. నువ్వు నిజంగా అప్సరసవే. కాని ఆమె మానవస్త్రీ... మంచీ మర్యాదా, ప్రేమా, స్నేహం, ఆదరణా తెలిసున్న సామాన్యగృహిణి. అదే ఆమెకుండే సహజ సౌందర్యం. ప్రతీ మానవుడూ వాంఛించేదికూడా అదే.” ఏదో ఆలోచిస్తున్నవాడిలా నెమ్మదిగా అన్నాడు రామం. ఈ మాటలంటుంటే అతని ముఖంలో ఏదో వింత వెలుగు కనిపించింది.

గీత మొదటిసారిగా ఓటమినంగీకరించవలసి వచ్చింది. తన అందం, తన డబ్బూ, తన హోదా, తను - ఎంతమందిచేతో పొగడబడిన తను - తృణీకరించబడింది. తన అందం అసలు అందమే కాదట. గీతకి తనుచుట్టూ వెయ్యి కంకాళాలు వికటాట్టహాసం చేస్తున్నట్లయింది. ఆమెకింక అక్కడ ఒక్కక్షణమైనా ఆగనవసరం లేదు. చెవులు హోరెత్తిపోతున్నాయి.

వెళ్లి కారులో పడేవరకూ, తను యీ లోకంలో వున్నట్లుగానే తోచలేదు. అతనేదో అంటున్నా వినిపించుకోకుండా యింటికి వెళ్లిపోయింది.

వెళుతూనే మంచంమీద పడిపోయింది. కోపం, కోపం వెనుక వుక్రోషం, ఆ వెనుక దుఃఖం ఒక్కసారిగా ముంచివేశాయి. ఎంత మాట అన్నాడు రామం! తను పుట్టిన దగ్గర్నుంచీ ఎవరిచేతా పల్లెత్తు మాట పడలేదే. తన యిరవైఏళ్ల జీవితంలోనూ కూడా యిటువంటిదేమీ సంభవించలేదు. తన తండ్రి ఎంత గారంగా పెంచాడు. తనకేం లోటని అలాగన్నాడు రామం. మొదటే తెలుస్తే అసలు రామం మొఖం చూసేదా తను?

ఎంతాపుకున్నా దుఃఖం ఆగలేదు గీతకి. వెక్కి వెక్కి యెంతోసేపు ఏడ్చింది.

ఇలా వూరుకోవడమేనా? తనేకదా పెండ్లి చేసుకోబోతున్నానని ఎంత గర్వంగా వుంది రామానికి! ఆ గర్వం ఎల్లాగయినా అణచాలి. ఏమిటుపాయం, పోనీ ఆ పెండ్లికూతురితోటి రామం చాలా చెడ్డవాడని చెప్పితే— పెండ్లి చెడిపోతుంది. బాగానేవుంది. కాని అసలా పెళ్లికూతురెవరో తెలియదు. అయినా కాక పోయినా అది ముఖ్యంగా తన హోదాకే భంగం.

మరెల్లాగ. ఏమైనా సరే ప్రతీకారం చెయ్యాలి... తనేనా అంత తక్కువ? ఎలాగా, ఏమి టుపాయం. అబ్బ! మెదడు వేడెక్కిపోతోంది... ఆ! అవును. అతనికంటే తనే ముందు పెండ్లి చేసుకుంటే చాలా బాగుంటుంది. ఎంత తెలివైన బుర్ర తనది. చెప్పుతీసుకు కొట్టినట్లుంటుంది. తను ముందు పెండ్లి చేసుకోవాలి. అతనికి ఆపెండ్లి అవాలి. ఐన తర్వాత బాగా పశ్చాత్తాప పడాలి. అప్పుడూ తన కానందం. లేకపోతే తనంతటి దాన్ని, స్వయంగా తను, నోరు విప్పి పెండ్లి చేసుకోమని అడిగితే వద్దంటాడా?

ఇంతవరకూ బాగానే వుంది. కాని ఎవర్ని పెండ్లిచేసుకోవటం. అబ్బబ్బా! అడుగడుక్కీ సమస్యలే. ఎవరైతేనేమిటి? రామం కాక పోయిన తర్వాత. ఎవరైనా ఒకటే. కాని, నిజంగా తను పెండ్లి చేసుకుంటానంటే, ఒక్కరూ నమ్మరు... సరికదా! గుండె ఆగి చచ్చిపోతారేమోనని భయంకూడాను! సుందరం సుబ్రహ్మణ్యం, గోపీ, రాజూ... అబ్బే వీళ్ళందరివీ ఒకళ్ళకంటే ఒకళ్ళవి పాత చింతకాయ పచ్చడి వూహాలు.

తీరా పెండ్లి చేసుకుందామనుకుంటే ఒక్కళ్ళూ తగినవాళ్ళు లేరే! గీత దృష్టి గబుక్కుని టేబిలుమీదున్న ఉత్తరంమీద పడింది. గీతకి మెరపులా ఒకఆలోచన తట్టింది. శేఖర్ని

పెండ్లి చేసుకుంటే? అవును. చాలా బాగుంటుంది. పాపం యిందాకటినుంచీ అతని సంగతి జ్ఞాపకం రానేలేదు. ఏదో సామెతలాఅయింది. శేఖర్ కేదో మేడా, కారూ వున్నాయి. బాగానే వుంటాడు. ఇప్పుడే వెళ్ళి చెప్పాలి. చెప్తే అసలు నమ్మడేమో——

ఓసారి అద్దంలో చూసుకుని "తలలలా" అని పాడుతూ హుషారుగానే మేడ దిగింది. కారెక్కి శేఖర్ యింటికి వెళ్ళింది.

ఇంకా అట్టే ఎక్కువగా రాత్రి అవలేదు. పౌర్ణమి ముందు రోజులేమో, చంద్రుడు తొందరగా వచ్చేశాడు. ప్రకృతంతా వెండిములామా చేసినట్టుంది. వెన్నెల రోడ్డుమీదపడి ఏదో వెండినది ప్రవహిస్తునట్టుంది.

కారు ఒక్క కుదుపు కుదుపి ఆగేవరకూ గీతకి స్మృతిరాలేదు. తన ఆలోచనలోంచి యివతల పడేసరికి డ్రైవర్ అక్కడ నౌకర్ని శేఖరున్నాడా అని అడుగుతున్నాడు.

"శేఖరుబాబుకి పెళ్ళండి. వూరెళ్ళారు. నెలదాకా రారు" అని చెప్పాడు నౌఖరు.

గీతకి గుండె ఆగినంత పనయింది. ఎలావచ్చి తన గదిలో పడిందో తనకే తెలీదు.

ఏమిటి తననుకునే ప్రతి పనికీ ఇలావిఘ్నం వస్తోందేమిటి? గీతకి బుర్ర బద్దలు కొట్టేసుకోవాలన్నంత బాధకలిగింది. ఎలాగ? తను ఇతరుల మొఖం యెలా చూడగలదు? యింత పరాభవం జరిగాక తను భరించి వూరుకోవలసిందేనా! ఎంత ఖర్మొచ్చింది ఇంక...ఇంక తను బ్రతికి లాభం ఏమిటి?

వెక్కి వెక్కి గంటలకొద్దీ యేడ్చింది. ఈ ప్రపంచంలో అభాగ్యులకూ, నిస్సహాయులకూ సమయానికి కనిపించేదీ, ఓదార్చేదీ యేడుపు ఒక్కటే.

అలా చాలాసేపు ఏడ్చినమీదట గీతకు కొంత మనస్సు స్థిమితపడినట్లనిపించింది. నెమ్మదిగా జరిగిన సంగతులన్నీ నెమరుకు తెచ్చుకోసాగింది.

రామం ఎందువల్ల అలా అన్నాడు? ఇంతమందీ తన్ను పొగిడేవారే కాని, నిజంగా తనెవరికీ అవసరంలేదు. తనుఅడిగినా అక్కరలేదంటారు. ఛీ. ఒక్కళ్ళకీ వ్యక్తిత్వం లేదు. దీపం చుట్టూ తిరిగే పురుగుల్లాగు! భగవంతుడు తననెందుకిలా పుట్టించాడు? అందరిలాగ పుట్టిస్తే, హాయిగా అందరిలాగా సుఖంగా వుండొచ్చు.

అద్దం ముందు కూర్చుంది. ఏదో విరక్తి పొగమంచులా గీతని ఆవరించుకుంది. నిజమే. రామం అన్నట్లు తనలో ఏదో వెలితివుంది. నిండుతనం రాలేదు. తనెంత ఫేషన్‌గా వుంటేనేం. ఎంత బాగా అలంకరణ అయితేనేం,తనెవరికీ అక్కరలేదు. ఎంత అప్సరసలా తయారయితేనేం. ఎవరికీఅక్కరలేని అందం తనకిమాత్రం ఎందుకు?

నెమ్మదిగా ఒక్కొక్క అలంకరణ సామానూతీసి మేడమీదనుంచి క్రిందికి విసిరెయ్యటం మొదలుపెట్టింది. అబ్బా! ఎన్ని రకాల స్నోలు. ఎన్నిరకాల క్రీములు, పౌడరు టిన్నులు, హెయిర్ రింగులు, పాలిష్——ఒక్కటికూడా వుంచదలుకోలేదు తను. ఒక్కొక్కటీ పడేస్తుంటే తనమీదనుంచి ఒక్కొక్క బరువు తీసేస్తున్నట్లనిపించింది.

అన్నీ పారేసి వచ్చి కూర్చుంది. అబ్బా! నిజంగా మనస్సిప్పుడెంత బాగుంది! జుట్టు మామూలుగా దువ్వేసుకుని ముడివేసుకుంది. సిల్కుచీర మార్చి, సాదాచీర కట్టుకుంది. అనవసరమైన వస్తువులు తీసేసింది.

అద్దంలో చూసుకుంది గీత. తను మునపటి గీతేనా——కాదు. నిజమే మునపటికంటే తను ఎన్నోరెట్లు బాగుంది యిప్పుడు. రామం చెప్పిన మాటల కర్థం యిదేనా? తనిప్పుడు సామాన్య స్త్రీయేనా! ఏమో రామాన్నే అడుగుతే సరి.

అవును. ఇప్పుడే అడిగెయ్యాలిఏమైనాసరే.

గబగబా కారు తనే నడుపుకుంటూ,రామం యింటి కొచ్చి తలుపు తట్టింది గీత.

తలుపు తీసి గీత వేషం చూసి ఆశ్చర్యపోయాడు రామం.

"రామం నన్ను క్షమించవూ!"ఇంక నిలువలేకపోయింది.ఉద్వేగంతో వణ్ళువణికిపోయింది.

"ఏమిటి గీతా" అంటూ అక్కడ కుర్చీలో కూర్చో పెట్టాడు రామం.

"కాదు రామం, నువ్వన్న మాటలకు అర్థం తెలుసుకోలేక, నిన్నెన్నో అన్నాను. క్షమించవూ!"

"నీలో యీ పరివర్తన కలుగుతుందని తెలి

సుంటే నేనల్లాగన్నాను. కాని, యింత తొందరగా నీలో మార్పు వస్తుందని నేననుకోలేదు" అన్నాడు రామం చిరునవ్వుతో.

"కాదు రామం! నన్ను క్షమించవూ! లేకపోతే నేనూ—" అంటూ లేవబోయింది.

"అబ్బే! యింత రాద్ధాంతం చేస్తావనుకోలేదు సుమా" రామానికి యింక నవ్వాగలేదు.

ఏమిటిదంతా తమాషానా! తన గర్వం తనకి తెలియ చేయడానికి చేసిందా! తను గ్రహించుకోలేకపోయింది. ఎంత సిగ్గు. తననీడ చూసి తనే భయపడింది. పోనీ యిప్పటికైనా తెలుసుకుంది. లేకపోతే యింకా ఎంత బాధ పడేదో. మబ్బులా వచ్చి మంచులా పోయింది.

"ఏమిట్రా, ఎవరూ వస్తా" అంటూ కళ్ళు నులుముకుంటూ వచ్చింది రామం తల్లి.

"ఇలారా, గీతా! అమ్మకి నమస్కారం పెడదాం" చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళాడు రామం. ఇద్దరూ ఒకేసారి ఆవిడ కాళ్ళకి నమస్కారం పెట్టారు.

"ఏమిటిరా నాయనా" అంటూ తెల్లబోయిందావిడ.

"కాదమ్మా, ఈవిడే నీ కాబోయే కోడలు" అన్నాడు రామం.

"అరె నీ యిల్లు బంగారం కానూ! మొదటే చెప్పకూడదురా నాయనా. ఏమని దీవించను. ధన ధాన్యాలతో, కొడుకూ కోడళ్ళతో వెయ్యేళ్ళు బ్రతకండి ఇద్దరూ." అంది రామం తల్లి వాత్సల్యంతో.

స్కెచ్

సుందరం ఉద్యోగం

ఆర్. యం. చిదంబరం

సుందరం యోచించాడు. దేశంలో ఏ మూల చూచినా ఆకలి మంటలు. ఎక్కడ చూచినా నిరాశతో కూడిన నిట్టూర్పులు. అంతా అంధకారమయం. నేటి ప్రజలకు మార్గం చూపే వెలుతురు శూన్యం. దీనికంతా కారణం? "ప్రభుత్వం" అనుకున్నాడు సుందరం. ప్రభుత్వమంటే ఎవరు? ప్రజలేగా. సుందరం అప్రయత్నంగా వార్తాపత్రికలో ఒక ప్రకటన చదివాడు.

"ఇక్కడకు ఎనిమిది మైళ్ళదూరంలో ఉన్న ఒక గ్రామానికి ఒక వర్తకుడు తీసుకుపోతున్న వంద బస్తాల బియ్యాన్ని ప్రభుత్వపు ఉద్యోగులు పట్టుకున్నారు. దీనినంతా ప్రజల కిచ్చే నిమిత్తం రేషన్ డిపోలకు చేర్చబడింది. సుందరం మళ్ళా తన ఆలోచన ప్రారంభించాడు. అయితే వర్తకుడెంత వెర్రివాడా! వంద బస్తాల బియ్యాన్ని వదిలేసుకున్నాడా? పాపం! ఆ బియ్యాన్నమ్ముకుంటే అతనికెంత లాభం వచ్చేది! అదంతా పోగొట్టుకున్నాడు....అబ్బే! అన్ని కోర్కెలను తీర్చే ఔషధముండగా నష్టపడటమెందుకు? వర్తకుడికి లంచాలతో సర్వము సాధింపవచ్చునని తెలియదా? ఏమో!"

మరునాడు వార్తా పత్రికలో చదివాడు సుందరం:

"ఈ గ్రామంలో నేటినుండి బియ్యం రేషను రెండౌన్సులు తగ్గింపబడింది. బియ్యం నిలవ లేకపోవటంవల్ల ఈ మార్పు చేయవలసి వచ్చిందని తెలుస్తూంది."

సుందరం తెల్లబోయాడు. ఏ గ్రామంలోని రేషను డిపోకయితే వర్తకుని వద్దనుండి తీసికొన్న వందబస్తాల బియ్యం ప్రజోపయోగ నిమిత్తమీయబడిందో ఆ గ్రామంలోనే బియ్యం రేషను రెండౌన్సులు తగ్గింపు! బియ్యం నిలవ లేకపోయిందట. చాలా వింతగా ఉందే! అయితే కంచే చేను మేస్తోందన్నమాటే. వీధిలో నుండి అరుపు:

"బాబూ! మూడు రోజులనుండి తిండిలేదు. పట్టెడన్నముంటే పెట్టు బాబూ."

సుందరం వెంటనే ఇల్లంతా బియ్యంకోసం వెదకాడు. కాని ఫలితం శూన్యం.

"అటు వెళ్ళు బాబూ, ఇక్కడ నాకే తిండికి లేదు."